30052025-DIS-04_Layout 1 5/30/2025 2:50 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## సంక్షోభంలో హార్వర్డ్

అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీకి సుమారు 400 ఏండ్ల చరిత్ర ఉన్నది. దేశదేశాల నుంచి వచ్చే విద్యార్థులు అందులో చదువుతారు. వారిలో కొందరు తమ తమ దేశాలకు వెళ్లిపోయిన తర్వాతనో లేదా అమెరికాలోనే ఉండిపోయి కీలక పదవులను చేపడుతారు. హార్వర్డ్ పూర్వ విద్యార్థుల్లో పది మందికి పైగా దేశాధినేతలు అయ్యారు. అలాంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం ప్రస్తుతం రాజకీయ సుడిగుండంలో చిక్కుకున్నది. తన మనుగడ కోసం, విలువల కోసం న్యాయపోరాటం చేస్తున్నది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో విడత అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రకరకాల ఎజెండాలతో తనదైన శైలిలో వివిధ రంగాలపై విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. 'అమెరికా ఫస్ట్', 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' వంటి తీవ్ర జాతీయవాద నినాదాలతో ఆయన అధికారంలోకి వచ్చారు. అమెరికా అమెరికన్లకే అంటూ ఇతర దేశీయులకు ప్రవేశం నియంత్రిస్తూ వస్తున్నారు. అమెరికా వెళ్లి చదువుకుని, ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడిపోయి డాలరు నీడలో హాయిగా బతుకుదామనుకునే విదేశీయులకు ట్రంప్ తన ఫర్మానాలతో చుక్కలు చూపిస్తున్నారు. అయితే అమెరికాలోకి ప్రవేశ ద్వారాల్లా పనిచేసే విశ్వవిద్యాలయాలపై ట్రంప్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. దీని వెనుక ఆర్థిక కారణాలు మాత్రమే ఉన్నాయనడానికి వీల్లేదు.

చదువుల్లో శిఖరాలు అధిరోహించేందుకు సోపానాలుగా పనిచేసే విశ్వవిద్యాలయాల్లో రాజకీయ కార్యకలాపాలు అధికంగానే ఉండటం చరిత్ర చాటిన సత్యం. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కీలక ఉద్యమాలకు యూనివర్సిటీలు వేదికలైన సందర్భాలు కోకొల్లలు. ప్రభుత్వాలు ఆ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడమూ తెలిసిందే. ఇప్పుడు హార్వర్డ్ విషయంలో జరుగుతున్నది అదే. గాజాలో జరుగుతున్న మారణహోమంతోపాటు అమెరికా ప్రభుత్వ పాత్రను నిలదీసే అనేక ఆందోళనలు అక్కడి విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్నాయి. ఇవి ట్రంప్ ప్రభుత్వానికి కంటగింపుగా మారాయి. ఈ తరహా ఆందోళనలను తక్షణమే ఆపాలని, విదేశీ విద్యార్థుల కార్యకలాపాల వివరాలను అందజేయాలని విశ్వవిద్యాలయాలపై ట్రంప్ ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. అంతేకాకుండా కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యానికి వీలుకల్పించాలని డిమాండ్ చేస్తున్నది. దాదాపుగా అన్ని వర్సిటీలు దీనికి అంగీకరించాయి. హార్వర్డ్ మాత్రం ఇలాంటివి అకడమిక్ స్వేచ్ఛను అరికడుతాయని, అమెరికా విలువలకు ఇవి వ్యతిరేకమని చెప్తూ తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది. దీంతో హార్వర్డ్‌ను దారికి తెచ్చుకునేందుకు సర్కారు సామ, దాన, భేద, దండోపాయాలతో రకరకాల ఎత్తుగడలను అమలు చేసింది.

ముందుగా ట్రంప్ సర్కారు నిధుల విషయంలో చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వపరంగా హార్వర్డ్‌కు విడుదల చేసే 300 కోట్ల డాలర్ల నిధుల విడుదలను ఆపివేసింది. మినహాయింపులను తొలగించి భారీగా పన్నులు వేస్తామనే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. అయినా హార్వర్డ్ లొంగిరాకపోవడంతో ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలకు దిగింది. విద్యార్థులకు సంబంధించిన సమాచారం ఇవ్వాలంటూ గత రెండు వారాల్లో రెండుసార్లు ఒత్తిడి తెచ్చింది. సమాచారం ఇచ్చినా సంతృప్తి చెందక విదేశీ విద్యార్థులను చేర్చుకునే అర్హతను ఉపసంహరిస్తూ గత 22వ తేదీ ఉత్తర్వులు జారీచేయడంతో ఆ మరుసటి రోజే సుప్రీంకోర్టులో హార్వర్డ్ కేసు వేసి స్టే తెచ్చుకున్నది. ఈ కేసులు, వాటి అంతిమ తీర్పుల మాటెలా ఉన్నా, మొత్తం మీద ప్రపంచవ్యాప్తంగా అమెరికా పేరుప్రతిష్టలు దిగజారిపోతున్నాయి. డాలరు స్వప్నాలు మసకబారుతుండటం నాణేనికి ఓవైపు అయితే, మరోవైపు అమెరికా రాజ్యాంగ నిర్మాతలు ప్రవచించిన ప్రజాస్వామిక విలువలు తీవ్ర పరీక్షకు గురవుతున్నాయి.

# డాలస్‌లో తెలంగాణ ఆవాజ్



మహేష్ బిగాల

**తెలంగాణ సమాజం గత రెండు దశాబ్దాల్లో విభిన్న అనుభవాలను చవిచూచింది. తొలి దశాబ్దంలో కష్టాల కడలిలో ఈదగా.. మలి దశాబ్దంలో తెలంగాణ ప్రజల బతుకులు సమూలంగా మారాయి. కష్టాలకు ఎదురేగి తెలంగాణ సమాజం చేసిన ఉద్యమం మొదలుకొని స్వరాష్ట్రంలో ప్రగతి పరుగుల వరకు సాగిన ప్రయాణానికి భారత రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక చరిత్ర ఉన్నది. ఈ మార్పునకు మూలం బీఆర్ఎస్ పార్టీయేనని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.**

**2001** ఏప్రిల్ 27న పురుడుపోసుకున్న టీఆర్ఎస్ 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఇటీవల వరంగల్‌లోని ఎల్కతుర్తి వేదికగా రజతోత్సవ మహాసభ జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానాన్ని విశ్వవ్యాప్తం చేయాలని పార్టీ సంకల్పించింది. అందులో భాగంగానే అమెరికాలోని డాలస్ నగరంలో జూన్ 1న రజతోత్సవ సభతోపాటు తెలంగాణ ఆవిర్భావ సంబురాలు జరగనున్నాయి. ఇది పార్టీ వేడుక మాత్రమే కాదు.. మలి దశ ఉద్యమానికి ఊపిరిపోసిన ప్రతి తెలంగాణ బిడ్డకు, ఉద్యమానికి, ప్రజాశక్తికి, గ్లోబల్ గుర్తింపునకు ప్రతీక.

2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ సమరశంఖం మోగించారు. కేసీఆర్ అవిరళ కృషి, ప్రజల్లో ఆయన కలిగించిన చైతన్యం, కేంద్రప్రభుత్వంపై చేసిన అలుపెరుగని పోరాటం ఫలితంగా 2014లో స్వరాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ఉద్యమాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కేసీఆర్ పాత్ర ఎనలేనిది. వివిధ సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు తెలంగాణ బిడ్డలను ఉర్రూతలూగించడమే కాకుండా.. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలతో పాటు గల్ఫ్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులను ఉద్యమం దిశగా నడిపించాయి. అమెరికాలోని డాలస్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్ డీసీ న్యూయార్క్, కాలిఫోర్నియా లాంటి నగరాల్లోని ప్రవాసులు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అమెరికాలోని ప్రవాస తెలంగాణవాసుల మద్దతు ఉద్యమానికి జాతీయ స్థాయిలో బలం చేకూర్చింది.

స్వరాష్ట్రంగా ఏర్పడ్డాక కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి సాధించింది. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ ప్రజల బతుకులూ బాగుపడ్డాయి. అదేవిధంగా ప్రవాస తెలంగాణవాసులకు గౌరవం దక్కింది. పార్టీని విశ్వవ్యాప్తం చేసే క్రమంలో పార్టీ గ్లోబల్ ఎన్నారై విభాగానికి నాయకత్వం వహించే అదృష్టం నాకు దక్కింది. నాపై నమ్మకముంచి ఈ అమూల్యమైన అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షుడు కేసీఆ ర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భం గా కృతజ్ఞతలు తెలుపుతున్నా. వివిధ దేశాల్లోని తెలంగాణ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించగలిగాను. పార్టీని 52 దేశాలకు తీసుకెళ్లగలిగాం. అంతేకాదు, టీఆర్ఎస్ ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో పార్టీ మద్దతుదారుల సాయం తో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాం. గల్ఫ్ సహా వివిధ దేశాల్లో ఉపాధి నిమిత్తం వచ్చే తెలంగాణ కార్మికులకు అండగా నిలబడ్డం.

దావోస్ సహా ప్రపంచవ్యాప్తంగా జరిగే పెట్టుబడి సదస్సులకు అప్పటి మంత్రి కేటీఆర్‌తో కలిసి హాజరవడం ఎంతో గొప్ప అనుభూతి. ఆయనతోపాటు వివిధ దేశాల్లో పర్యటిస్తూ, అంతర్జాతీయ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ అభివృద్ధికి మా వంతుగా తోడ్పడటం మాకు దక్కిన భాగ్యం. కేటీఆర్ కృషి ఫలితంగా అమెరికాలోని డాలస్, శాన్‌జోస్, వాషింగ్టన్ డీసీ వంటి నగరాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక టెక్ కంపెనీలు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. యాపిల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, రైట్ సాఫ్ట్‌వేర్, గ్రీన్ రోబోటిక్స్, స్టైరాక్స్ ఫార్మా, జెనెసిస్ బయోలాజిక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో కొలువుదీరాయి. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, సిద్దిపేట లాంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ పరిశ్రమ విస్తరించింది. ఇవి కేవలం పెట్టుబడులు కాదు, యువతకు అవకాశాల వెల్లువ.

> ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమం, ప్రగతిని స్మరించుకునేందుకు బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని సంకల్పించాం. ఈ విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించగా ఆయన సమ్మతించారు. కార్యక్రమ నిర్వహణకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు.

2025 జూన్ 1న డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరీనా వేదికగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రవాస భారతీయులు, ప్రవాస తెలంగాణ వాసులు, యువత వేలాదిగా తరలి రానున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఏడాది మొత్తం వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎన్నారై విభాగం యోచిస్తున్నది. యూకే, గల్ఫ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తోపాటు వివిధ దేశాల నుంచి సంప్రదిస్తున్నారు. కేటీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం. రాబోయే రోజుల్లో వీలైనన్ని దేశాల్లో ఈ వేడుక నిర్వహించేందుకు ప్రయత్నిస్తాం.

స్వరాష్ట్ర విధాత, అభివృద్ధి ప్రదాత కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలతోపాటు, ప్రవాస తెలంగాణీయులు కూడా భావిస్తున్నారు. అందుకే తెలంగాణ బాగు కోసం మరోసారి కేసీఆర్ అధికారంలోకి రావాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. రజతోత్సవ సభ సందర్భంగా యావత్ అమెరికా డాలస్ వైపే చూస్తున్నది. డాలస్ మొత్తం కేటీఆర్ వైపే చూస్తున్నది. కేటీఆర్ ప్రసంగం కోసం ప్రతి ఒక్కరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రతి తెలంగాణ బిడ్డ గర్వించాల్సిన సమయమిది. మన భవిష్యత్తును నిర్దేశించే వేడుక ఇది. అందుకే ఈ వేడుకలో అందరూ పాల్గొనాలని విన్నవిస్తున్నా.

**జై బీఆర్ఎస్! జైజై తెలంగాణ!**

(వ్యాసకర్త: గ్లోబల్ ఎన్నారై కోఆర్డినేటర్-బీఆర్ఎస్)



# అంతర్జాతీయంగానూ అవమానం!



డాక్టర్ ఎర్రోల్ల శ్రీనివాస్
90100 96777

**ఏదైనా ఒక అంతర్జాతీయ వేడుక నిర్వహించాల్సి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. క్రీడా పోటీలు గానీ, అంతర్జాతీయ సదస్సులు గానీ.. ఏర్పాట్లు ఘనంగా చేసి ప్రతిష్ట ఇనుమడింపజేసేలా కృషిచేస్తాయి. ఈ కోవలోనే మిస్ వరల్డ్ పోటీలు మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఈవెంట్ నిర్వహణకు వచ్చిన అతిథులకు లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.**

అందాల పోటీలు తెలంగాణలో నిర్వహించడంపై ఆదినుంచీ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇక్కడ రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన డబ్బు కూడా ఇవ్వకుండా సర్కార్ సతాయిస్తున్నది. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నన్ను కోసుకు తిన్నా పైసల్లేవంటూ.. ఈ మధ్య వ్యాఖ్యానించారు. అలాగే రాష్ట్రం దివాలా తీసిందని, అప్పు పుడతలేదంటూ రాష్ట్రం పరువు తీసేలా ప్రవర్తించారు. ఆయన వ్యవహారశైలితో రాష్ట్ర ప్రతిష్ట మసకబారే పరిస్థితి నెలకొన్నది. కానీ, తద్భిన్నంగా అందాల పోటీలు నిర్వహించేందుకు మాత్రం రేవంత్ జోరుమీదున్నారు. అంతర్జాతీయ ఈవెంట్ విజయవంతంగా నిర్వహించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామంటూ ప్రకటనలతో సర్కార్ ఊదరగొట్టింది. తాజాగా హైటెక్స్‌లో భారత్ సమ్మిట్ పేరిట పార్టీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సర్కార్.. ప్రజాధనంతో నిర్వహించింది. ప్రభుత్వ డబ్బు రూ.30 కోట్లకు పైగా వెచ్చించడంపై విమర్శలు వచ్చాయి. ఢిల్లీ వెళ్లినప్పుడు రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్న ఆరోపణలకు చెక్ పెట్టేందుకే ఈ ఈవెంట్ నిర్వహించి రేవంత్ షో చేశారన్న విమర్శలు వచ్చాయి.

అందాల పోటీల నిర్వహణలో ముందుకువెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తేవడానికి బదులుగా, అప్రతిష్ట మూటగట్టుకునే పనులు చేస్తున్నది. ఈ పోటీల నిర్వహణకు సుమారు రూ.54 కోట్లు ఖర్చవుతుందని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ప్రభుత్వం రెండూ కలిసి అంచనా వేశాయి. ఇందులో రూ.27 కోట్లు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్, మరో రూ.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాలని నిర్ణయించాయి. అయితే, ఇందులో ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లే వెచ్చిస్తామని, మిగతా రూ.25 కోట్లు స్పాన్సర్ల నుంచి సేకరిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు ఊదరగొట్టారు. అయితే, స్పాన్సర్లు ఎవరూ ముందుకురాలేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం వేసిన అడుగులు అంతర్జాతీయ స్థాయిలో చెడ్డపేరు తెచ్చిపెట్టాయి. మిస్ వరల్డ్ కార్యక్రమాల్లో ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా స్పాన్సర్ల కొరతతో కాలయాపన చేసేందుకు అందాల భామలను రాష్ట్రంలో తిప్పుతున్నారు.

ప్రపంచ సుందరీమణులను తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో పర్యటింపజేయడం ద్వారా అంతర్జాతీయంగా తెలంగాణ పర్యాటకాన్ని పుంజుకునేలా చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలకు ఇప్పటికే చారిత్రక నేపథ్యం ఉన్నది. ఉదాహరణకు రామప్ప దేవాలయం వరల్డ్ హెరిటేజ్ సెంటర్. ప్రత్యేకించి అందాల భామల సందర్శనతో దానికి కొత్తగా వచ్చే ప్రాచుర్యం ఏమున్నది? మరోవైపు పోచంపల్లి చీరలకూ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు ఉన్నది. అంటే ప్రభుత్వం ఒక ప్రచార ఆర్భాటానికి తప్ప, అందాల భామల సందర్శనతో నయాపైసా ఉపయోగం లేదని, పైగా ప్రభుత్వ సొమ్ము వృథా అవుతుందన్నది సుస్పష్టం.

అందాల భామలకు విందు పేరిట సంపన్నులను ఆహ్వానించి, రాష్ట్ర ప్రభుత్వం ఓ కార్యక్రమాన్ని తాజాగా ఏర్పాటుచేసింది. తద్వారా స్పాన్సర్‌షిప్ తేవాలని ప్రయత్నించింది. అయితే, ఈ కార్యక్రమం ఎంత జుగుప్సాకరంగా సాగిందంటే.. వివిధ దేశాల నుంచి వచ్చిన అందాల భామలను వీఐపీల వద్ద కూర్చోబెట్టారు. స్పాన్సర్ల కోసం వీఐపీలతో సన్నిహితంగా వెళ్లాలని అధికారులు సూచించడం దారుణమైన విషయం.

> ఆయా దేశాల్లో అత్యుత్తమంగా రాణించిన విన్నర్లు.. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు వస్తే వారితో ఇలాగేనా ప్రవర్తించేది? మిస్ వరల్డ్ పోటీలను ఇంత చిల్లర వ్యవహారంగా మార్చి, క్లబ్ డ్యాన్సర్ల మాదిరిగా ట్రీట్ చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వారిని ఘోరంగా అవమానించింది.

మిస్ ఇంగ్లండ్ దీనికి అభ్యంతరం చెప్తూ.. సంచలన విషయాలు వెల్లడించింది. తనను అవమానించారని వాపోయింది. ఈ విషయం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అయి తే, ఈ ఘటనపై విచారణ పేరిట ప్రభుత్వం ముగ్గురితో కమిటీ వేసింది. కానీ, వీఐపీల వద్ద అందాల భామలను కూర్చోబెట్టడమే ప్రభుత్వం చేసిన పెద్ద తప్పు. అలాంటి ప్రభుత్వమే మళ్లీ కమిటీ వేయడం హాస్యాస్పదం. తప్పును తెలుసుకొని భేషజాలకు పోకుండా, పోటీల నిర్వహణలో ఫెయిలయ్యామని ఒప్పుకొని కాంగ్రెస్ సర్కార్, ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి.

20 రోజులుగా ఈ అందాల పోటీల చుట్టూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తిరుగుతున్నారు. ప్రజా సమస్యలను, పాలనను పట్టించుకోకుండా కేవలం ప్రచారానికి, డైవర్షన్ పాలిటిక్స్‌కు రేవంత్ సర్కార్ పరిమితమైంది. రాష్ట్రంలో అన్నదాతలు అరిగోస పడుతున్నరు. అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ధాన్యం తడిసిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నరు. వారిని పరామర్శించేందుకు ఏ ఒక్క మంత్రికి గానీ, అధికారికి గానీ తీరిక లేదు. అంతర్జాతీయ కార్యక్రమం పేరు చెప్పి రాష్ట్రంలో సమస్యలను గాలికివదిలేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఖ్యాతి తేవడం దేవుడెరుగు.. అపఖ్యాతిపాలు చేస్తుండడంపై ప్రజలు భగ్గుమంటున్నారు.

(వ్యాసకర్త: రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్)





# కగార్ పేరిట మారణహోమం



కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య

**మే 21న నారాయణపూర్ ఊచకోతలో సీపీఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును చట్టవిరుద్ధంగా హత్యచేసిన తర్వాత, మోదీ ప్రభుత్వం విజయోత్సాహంలో ఉన్నట్టు కనిపిస్తున్నది. హోం మంత్రి అమిత్ షా దీన్ని 'నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి' అని అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని 'అద్భుతమైన విజయం'గా ప్రకటించారు.**

కర్ణాటక బీజేపీ నేతలు హోంమంత్రి అమిత్ షా కాలీఫ్లవర్ పట్టుకొని ఉన్న ఒక చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఆ చిత్రాన్ని చూసిన వెంటనే.. 1989లో భాగల్పూర్‌లో జరిగిన ఒక మారణహోమం గుర్తుకువచ్చింది. ఆ మారణ హోమంలో వంద మందికి పైగా వ్యక్తులను చంపి, సమాధి చేసిన నేలపై కాలీఫ్లవర్లు పెంచినట్టు హంతకులు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తన అతి పెద్ద మావోయిస్టు వ్యతిరేక సైనిక విజయాన్ని ప్రకటించుకున్న తరుణంలో భారత దేశంలో అత్యంత దారుణమైన మారణ హోమాల్లో ఒకదాన్ని బీజేపీ గుర్తుంచుకొని మరీ ఈ ఘోర కార్యానికి పూనుకున్నది.


నారాయణపూర్ మారణహోమంలో మావోయిస్టుల మరణాలను సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తరఫున విడుదల చేసిన పత్రికా ప్రకటన ధృవీకరిస్తున్నది. దీని ప్రకారం ఈ మారణహోమంలో 28 మంది కార్యకర్తలు మరణించారు. వీరిలో అనేక మంది మహిళలు, పార్టీ సీనియర్ నాయకులున్నారు. బసవరాజుకు 60 మందికి పైగా యోధులతో కూడిన తక్షణ భద్రతా వ్యవస్థ ఉన్నదని, కానీ జనవరి నుంచి వేగవంతమైన కదలికల కోసం ఆ సంఖ్యను తగ్గించారని ఆ ప్రకటనలో పేర్కొన్నది. రక్షణ వలయంలోని కొందరు లొంగిపోవడం ద్రోహులుగా మారడంతో రాజ్యం తమ మిలటరీ ఆపరేషన్‌ను విజయవంతంగా ప్లాన్ చేసి అమలుచేయడానికి వీలు కలిగింది. మారణహోమం జరిగిన సమయంలో బసవరాజుకు 34 మంది యోధులు కాపలాగా ఉన్నారు. వారిలో ఏడుగురు భద్రతాదళాల వలయాన్ని ఛేదించి విజయవంతంగా తప్పించుకోగలిగారు. బసవరాజు తల్లి, నాగేశ్వర్‌రావు కుటుంబసభ్యులు, ఇతర నాయకులు, వారి బంధువుల మృతదేహాలను అంత్యక్రియల కోసం ఇంటికి తీసుకురావడానికి వారి కస్టడీని కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుకూల ఉత్తర్వు ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ, కుటుంబసభ్యులు మృతదేహాల కోసం వేచి ఉండగా, రాష్ట్రం వాటిని 'క్లెయిమ్ చేయని మృతదేహాలు' అంటూ దహనం చేసింది.

> మావోయిజంపై యుద్ధం ముసుగులో, సైనికీకరణ కార్పొరేట్ దోపిడిల సంబంధానికి వ్యతిరేకంగా బస్తర్‌లో జరుగుతున్న ప్రతి ఆదివాసీ నిరసనను మోదీ ప్రభుత్వం మరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నదని మనం గమనించాలి. గాంధేయవాది హిమాన్షు కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి బహిష్కరించారు. రచయిత్రి-కార్యకర్త బేలా భాటియాను వేధిస్తున్నారు, అణచివేస్తున్నారు. బస్తర్‌లో దీర్ఘకాల ప్రజాదరణ పొందిన ప్రజా గొంతుక మాజీ సీపీఐ ఎమ్మెల్యే మనీష్ కుంజమ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మూలవాసి బచావ్ మంచ్ అని పిలువబడే స్థానిక ప్రజల సైనికీకరణ వ్యతిరేక వేదికను నిషేధించారు. విచక్షణారహితంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం-చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం వంటి క్రూరమైన చట్టాల కింద ప్రజలను మూకుమ్మడిగా అరెస్టు చేస్తున్నారు. ఒక భావజాలాన్ని సమర్థించడం నేరం కాదనీ, ప్రతి ఎన్‌కౌంటర్‌పై తప్పనిసరి దర్యాప్తు కోసం మార్గదర్శకాలున్నాయని సుప్రీంకోర్టు పదే పదే చెప్పింది. నేడు సైద్ధాంతిక వేట ఎన్‌కౌంటర్ హత్యలు, తటస్థీకరణగా ఎక్కువగా వర్ణించబడుతున్నాయి. ఇవి రాజ్యం నిరంకుశ పాలసీకి మూల స్తంభాలుగా మారాయి.

'ఆపరేషన్ కగార్' పరిణామాలు బస్తర్ లేదా మావోయిస్టులకే పరిమితం కావు. అవి న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి, ఫాసిస్ట్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే అన్ని అసమ్మతులకూ శరాఘాతంగా మారుతాయి. త్వరలోనే, బస్తర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ అరాచక మోడల్ కొత్త లక్ష్య సమూహాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా అమలవుతుంది. బీజేపీ కర్ణాటక దుష్ట చిత్రాల్లో అమిత్ షా చేతుల్లో ఉన్న కాలీఫ్లవర్ అందరికీ ఒక హెచ్చరికగా పనిచేయాలి. మావోయిస్టులు ఏక పక్ష కాల్పుల విరమణ ప్రకటించిన సమయంలో, శాంతి సంభాషణల ద్వారా రాజకీయ పరిష్కారం కోసం విస్తృత సమావేశం జరగాలి.

భారత రాజ్యాంగం మనుగడ సాగించాలంటే నారాయణపూర్ హత్యాకాండ, ఆపరేషన్ కగార్ పేరిట జరిగిన మారణహోమాలపై న్యాయ విచారణ జరిగి తీరాలి. మావోయిస్టులు ప్రస్తుత పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలి. బస్తర్ తదితర ప్రాంతాల సాధారణ ప్రజానీకం గౌరవ ప్రదమైన న్యాయానికి అర్హులు. ఈ అమానుష సైనికదాడికి బలైన అమాయక జన బాహుళ్యానికి న్యాయం జరిగేలా చూడటం ప్రజాస్వామ్యవాదుల బాధ్యత.

(వ్యాసకర్త: జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్)




# ఎన్నికలు ఎప్పుడైనా పెట్టండి!



**ప్రపంచ వేదికపై ప్రతిపక్షాలు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆపరేషన్ సిందూర్ చేసినట్టుగా 'ఆపరేషన్ బెంగాల్' చేయాలని ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు చెప్పడం దురదృష్టకరం. మోదీ ప్రధానిలా కాదు, బీజేపీ అధ్యక్షుడిలా మాట్లాడారు. అసలా వ్యాఖ్యలు చేయడానికి ఆయనకు ఎంత ధైర్యం? నిజంగా ధైర్యముంటే రేపే ఎన్నికలు పెట్టండి. మేం సిద్ధం.**

**- మమత, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**